కథానిక

# అపరాధ పరిశోధకుడు

గోపరాజు రామారావు

సుబ్బారావ్ "హనుమాన్ టింబర్ డిపో" లో గుమాస్తాగా చేరాడు. "ఉద్యోగం చెయ్యరా" అంటే మీద విరుచుకుపడే సుబ్బారావు అకస్మాత్తుగా గుమాస్తా గిరికి తయారయ్యాడంటే నాకు చాలా ఆశ్చర్యమేసింది.

"ఉద్యోగం చేయడమంటే ఆత్మగౌరవాన్ని చంపుకొని బానిసలా జీవించటమే" అని బల్ల గుద్ది వాదించే సుబ్బారావ్ టింబర్ డిపోలో పనికి కుదిరాడంటే అందరికీ ఆశ్చర్యాన్ని కల్గించింది. మూడవ ఫారంతో చదువుకు స్వస్తి చెప్పి ముడుచుక్కూర్చున్న ఇతనికి ఆ ఉద్యోగమెలా ఇచ్చారా అనే సందేహం కొందరికి కలిగింది. టింబరు డిపో యజమానికి సుబ్బారావు తండ్రికి గల బాల్యస్నేహితం వల్లనే అతనికా స్థానం లభ్యమైనదన్న విషయం తేలాక, తమకా అదృష్టం పట్టనందుకు చింతిస్తూ చప్పగా చల్లబడ్డారు.

ఉద్యోగంలో చేరిన సుబ్బారావ్ ప్రతిరోజు ఉదయం 8 గంటలయ్యేసరికి ఒకచేత్తో టిఫిన్ కారియర్, మరోచేత్తో ఒక పుస్తకం పుచ్చుకొని డిపోవైపు నడిచేవాడు. రోడ్డుమీద నడుస్తున్నా, వచ్చేపోయేవాళ్లను "ఢీ" కొంటున్నా, అటు ఇటు గందరగోళంగా పరుగులు తీసే మోటారుకార్లను సైతం లెఖ్ఖచెయ్యకుండా తన చూపుల్ని ఆ పుస్తకంమీదే కేంద్రీకరించి నడిచిపోతూండేవాడు.

అతనలా రోడ్డుమీద వెళ్తూంటే చూచిన వారంతా "ఆ పుస్తకం డిపో రికార్డుకు సంబంధించి ఉంటుందనీ, అందుకే అతనంత శ్రద్ధ చూపుతున్నాడనీ అనుకొని అతను దాని విషయంలో చూపే శ్రద్ధాసక్తుల్ని అభినందించేవారు. సుబ్బారావు తనలో తాను నవ్వుకొన్నాడు. వీళ్ళింత వెఱ్ఱి మనుష్యులేమా అని. ఇదీ ఒకందుకు మంచిదే ననుకొన్నాడు. ఈ విషయమే యజమాని చెవిన పడితే తను డిపోలో ఎలా ప్రవర్తించినా ఇబ్బంది ఉండదని అనుకొన్నాడు.

సుబ్బారావుకి విద్యార్థి దశలోనే "డిటెక్టివ్" కావాలని పిచ్చికోర్కె కల్గింది. ఆ కోరికను సాధించుకోవాలని బ్రహ్మ ప్రయత్నాలు జరిపికూడా కృతకృత్యుడు కాలేకపోయాడు. ఐనా నిరుత్సాహపడలేదు. అప్పటి నుండి ఇంట్లోగానీ ఆ చుట్టుపక్కల వాండ్ల ఇండ్లలోగానీ ఏ చిన్నవస్తువు పోయినా తనా ప్రదేశానికి వెళ్ళి పెద్ద అపరాధ పరిశోధకుడిలా అడ్డదిడ్డమైన ప్రశ్నలువేస్తూ వాళ్ళని విసిగించి చీవాట్లు తినేవాడు. తన గొప్పతనాన్ని, పట్టుదలనీ వాళ్లు గుర్తించలేనందుకు బాధపడేవాడు ఇలా కాదనుకొని "డిటెక్టివ్" నవల్స్‌ని చదివేవాడు. ఆ చదువుతున్నంతసేపూ తనని తానే మర్చిపోయి స్వప్నజగత్తులో అడుగుపెట్టి తానో "డిటెక్టివ్" అయినట్లు, వేలకొలది కేసులు పట్టుకొన్నట్లు వాళ్లు జవాబు చెప్పలేక తికమకలు పడ్తున్నట్లు, తన సాహస కార్యాలకి ప్రభుత్వాధికారులు మెచ్చి పతకాలు ప్రసాదించినట్లు కలలు కనేవాడు. జాగ్రదావస్థలో కొచ్చాక జరిగినదంతా స్వప్నమని ఎప్పటికైనా ఆ శుభదినాలు రాకపోవని తన ప్రజ్ఞను ప్రజలు తెలుసుకోక పోరని విశ్వసించాడు సుబ్బారావు. నానాటికి అతనిలో డిటెక్టివ్ కావాలనే వాంఛ పెరిగిపోతోంది. ఉద్యోగంలో చేరాకకూడా తన ప్రవర్తనని సరి దిద్దుకోకుండా, తన విద్యుక్తధర్మాన్నే మరిచి ఆఫీసులోకూడా గ్రంథపఠనం సాగించేవాడు. రెండుమూడుసార్లు యజమాని మందలించినా లెక్కచెయ్యనట్లుగా ఉండేవాడు.

ఒకనాడతనికొక నవల దొరికింది. దాన్ని సంపాదించి ఆఫీసులో కూర్చుని దీక్షగా చదువుతున్నాడు. ఆ సమయంలో అకస్మాత్తుగా యజమాని ఊడిపడి పెట్టవలసినవి

నాలుగూ పెట్టి పనిలోకి రావద్దని శాసించాడు. దాంతో సుబ్బారావ్ తలొంచుకొని బయటికి నడిచాడు. ఉద్యోగం ఊడిందన్న విచారంకన్నా డిటెక్టివ్ నవల్స్ చదవటానికి కావలసినంత కాలం ఉన్నదన్న సంతోషం ఎక్కువయింది. ఆ ఆనందంతో అడుగులు త్వరగా వేస్తూ ఓ గ్రంధాలయం ముందు ఆగి జేబులో డబ్బుల్ని గలగలమనిపిస్తూ లోపలికెళ్ళాడు. అనాటినుంచి అతనా గ్రంధాలయపు సభ్యుడు. రోజూ బీరువాలోంచి పుస్తకాలు తీయటం, చదవటం, మళ్ళీ యధాస్థానంలో ఉంచటం, ఇదీ అతని దైనందిన కార్యక్రమం.

ఆరోజు ఉదయంనుంచి కుంభవర్షంకురిసింది. వానలో ఎక్కడకూ వెళ్ళడానికి వీల్లేక వరుణ దేవుణ్ణి నిందిస్తూ, క్రితం రోజు లైబ్రరీ నుంచి పుస్తకాలు తెచ్చుకోక పోయినందుకు తనను తాను నిందించుకొంటూ సాయంత్రం అయిదు గంటలదాకా ఆ వేదన పడుతూ కాలం గడిపాడు. వర్షం తగ్గిపోయింది. బయల్దేరాడు గ్రంధాలయానికి. మూసి ఉన్న తలుపులనుచూసి నిర్ఘాంతపోయాడు. వెంటనే అతనికి స్ఫురణకొచ్చింది ఆనాడుసోమవారమని, గ్రంధాలయానికి సెలవు దినమని. ఇక చేసేదేమీలేక నిరుత్సాహంతో ముందుకు నడిచాడు పార్కుకు పోదామని. దారిలో ఒకచోట గుంపులు గుంపులుగా నిల్చొని ఉన్న జనాన్ని తొంగి చూశాడు. అక్కడ రక్తం కక్కుతూ నేలపై పడి ఉన్న బాలుడ్ని, అతని పక్కన చేత్తో కత్తిపుచ్చుకుని నిల్చొని ఉన్న గంభీరాకారాన్ని చూసి, ఆ స్థూలకాయుడు ఆ కుర్రవాడిని చంపి ఉంటాడని ఊహించి నాల్గువైపులా చూచాడు. పార్కుకు కొద్ది దూరంలోనే ఉన్న పోస్టాఫీసు దగ్గరకు పరుగుతీస్తూ చేరాడు. టెలీఫోన్‌లో పోలీస్ ఇనస్పెక్టర్ను పిలిచి పూర్తి వివరాలు ఇస్తూ హత్యజరగబోయేముందు తానా పరిసరాల్లోనే ఉన్నాననీ, ఒంటరి వాణ్ణవటంవల్ల అడ్డు తగలలేకపోయానని, ఆఘోరాన్ని తనకండ్లారా చూశానని చెప్పి పార్కు దగ్గరకు చేరాడు పోలీసుల రాకకోసం ఎదురు చూస్తో.

కొన్ని నిముషాలు గడిచాక పోలీస్ వాన్ వచ్చింది హడావుడిగా. గబగబాదిగారు పోలీసులంతా. ఒక మూలనుంచి మరో మూలకి పరుగులు తీస్తూ, విచిత్రంగా చూస్తూ నిల్చొని ఉన్న వారిపై లాఠీ ప్రయోగం చేస్తో నానాహంగామా జరిపారు. సుబ్బారావ్ తన తెలివితేటల్ని తనలో తాను మెచ్చుకొంటూ, ఇన్‌స్పెక్టర్ దగ్గరకు చేరి అసలుకు కొంత కల్పించి కథగా అల్లి చెప్పాడు. అతను చెప్పినదంతా విని నమ్మకం కుదరక అక్కడున్న వారిని అడిగాడు "ఏమిటి" అని. "ఇదంతా గారిడీ వాడి మహత్యం. ఆ కుర్రవాడు నిజంగా చనిపోలేదు. గారిడివాడు తన మంత్రజాలాన్ని మా ముందు ప్రదర్శించాలనే ఉద్దేశ్యంతో ఆ కుర్రవాణ్ణి నేలమీద పడుకోబెట్టి కత్తితో పొడిచాడు. రక్తం వచ్చింది. అది నిజమైన రక్తంకాదు. అప్పుడే ఈ ప్రదేశాన్ని కొచ్చిన ఈయన విషయాన్ని అర్థం చేసుకోకుండా త్వరపడి మీకు కబురుచేశారు" అని చెప్పారు. ఆ మాటలు విన్న ఇనస్పెక్టర్ కడుపు పగిలేటట్లు నవ్వుతూ సుబ్బారావును సమీపించి వీపు తట్టుతూ "భలేవాడివయ్యా" అంటూ తన పరివారంతో అక్కడ్నుంచి వెళ్ళిపోయాడు. పాపం సుబ్బారావ్ మొహంలో నెత్తురు చుక్కలేదు. అక్కడున్న వాళ్ళంతా తనను చూసి నవ్వుతుంటే, జరిగిన అవమానానికి సిగ్గుపడుతూ, తనుచేసిన తప్పిదానికి చింతపడుతూ తలొంచుకుని ముందుకు నడిచాడు. ఆ క్షణంలో అతనికి జీవితంమీదే విరక్తి కల్గింది. తను నలుగురిలో నవ్వులపాలు కావటానికి "డిటెక్టివ్" కావాలనే పిచ్చి కోరికే కారణ మనుకుంటూ ఇంటికిచేరాడు. వారం రోజుల క్రితం వంద రూపాయలు ఖర్చుపెట్టి కొన్న "డిటెక్టివ్" నవల్స్ బీరువాలోంచి తొంగిచూస్తూ తనని వెక్కిరించినట్లుగా ఉన్నాయ్. కోపంతో పుస్తకాలను గుట్టగా పడేసి అగ్గిపుల్లగీసి ఆహుతిచేసి ఈజీ చైర్‌లో పడుకొని ధగధగ మండి మసి అయిన గుట్టవైపు ఒక చూపు విసిరి సిగరెట్ వెలిగించి నిర్మలాకాశంకేసి నిశ్చింతగా చూస్తో, స్వప్నజగత్తు నుండి వాస్తవ జగత్తుకు దిగివచ్చాడు.